సాక్షి
సిద్దిపేట
మంగళవారం : 14 : ఫిబ్రవరి : 2023



వెటర్నరీ కాలేజీకి చకచకా ఏర్పాట్లు
పీవీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి అనుబంధంగా సిద్దిపేట జిల్లాలో పశువైద్య కళాశాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 8లో..



ఎల్లలు దాటేలా జాతర
ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. 8లో..



సమన్వయంతో పనిచేయాలి 9లో..
ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మద్దూరు మండల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి కోరారు.

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా ఫిబ్రవరికి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై మండల వ్యవసాయ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 8,000 ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతుందన్నారు. అలాగే ఫిబ్రవరిలో జిల్లాకు 2,217 ఎకరాల లక్ష్యాన్ని 23 మండలాల వ్యవసాయ అధికారులకు మండలాల వారీగా టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి ఇప్పటివరకు 410 ఎకరాలకు రైతులను గుర్తించి రైతు వాటా చెల్లించడం జరిగినదన్నారు. అలాగా క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షలు నిర్వహించి కొత్త రైతులను గుర్తించి త్వరితగతిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఉద్యాన అధికారులు, టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

మల్లన్న బుకింగ్ ఆదాయం రూ.42 లక్షలు



స్వామి వారి మూల విరాట్టు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురెల్లి మల్లన్న మూడో వారం బుకింగ్ బుకింగ్ ఆదాయం రూ.42,55,602 వచ్చినట్లు సోమవారం ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో శనివారం రూ.2,84,785, ఆదివారం రూ.32,77,075, సోమవారం రూ.6,93,742 చొప్పున ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాద విక్రయాలు తదితర వాటి ద్వారా స్వామి వారి ఖజానకు సమకూరినట్లు తెలిపారు.

రూ.2.12 లక్షలకు టెండర్

ఆలయంలో నూతనంగా నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ నిర్వహణకు సోమవారం టెండర్ నిర్వహించారు. మొత్తం 145 రోజులకు గాను రూ.2,12,000 లకు స్వచ్ఛ భారత్ వెల్ఫేర్ సొసైటీ దీన్ని దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. టెండర్ కాలపరిమితి 15 ఫిబ్రవరి 2023 నుంచి 09 జులై 2023 వరకు ఉంటుందన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలకమని, పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని గంగాపూర్, విఠలాపూర్, చంద్లాపూర్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు పాఠాల బోధన జరగాలన్నారు. అలాగే వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు బహుమతి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీ తిరుపతి తదితరులు ఉన్నారు.

1,20,282 మందికి కంటి పరీక్షలు

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తం కంటి పరీక్షల నిర్వహణ ముమ్మరంగా కొనసాగుతోంది. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 47 బృందాల ద్వారా వైద్య సిబ్బంది 1,20,282 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 26,975 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ సోమవారం తెలిపారు. అలాగే మరో 20,279 మందికి కంటి అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు పేర్కొన్నారు.

ప్రేమిస్తే పెద్దలను ఒప్పించాలి

తల్లిదండ్రులను గౌరవించాలి

- జీవితంలో స్థిరపడిన తర్వాతే ప్రేమ
- పెళ్లి తర్వాత తగ్గుతున్న ప్రేమాభిమానాలు
- 'సాక్షి' టాక్ షోలో ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

సాక్షి, సిద్దిపేట/సిద్దిపేటఅర్బన్: రెండక్షరాల ప్రేమ. ఇది ఒక్కసారి మనసులో మొదలైందంటే ఆనంద డోలికల్లో విహరింపజేస్తుంది. కుల మతాలెరుగని ప్రేమ విఫలమైతే గాఢాంధకారంలో ముంచేస్తుంది. కుల మతాలతో పట్టింపు లేని యువతీయువకులు ఎల్లలు దాటి పెద్దలను ఒప్పించి, ఎదురించి పెళ్లితో ఒక్కటవుతారు. కొన్ని ప్రేమలు విఫలమై జీవితాలనే లెక్క చేయకుండా తనువు చాలిస్తున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో 'పెళ్లికి ముందు ప్రేమ – పెళ్లి తర్వాత ప్రేమ' అంశంపై 'సాక్షి' ప్రత్యేక టాక్‌షో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 99 శాతం విద్యార్థులు.. ప్రేమిస్తే.. ఇంట్లో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలంటున్నారు. అప్పుడే కుటుంబ సభ్యుల అండ ఉంటుందన్నారు. అలా అయితేనే జీవితంలో స్థిర పడిన తర్వాత పెళ్లిపై నిర్ణయం తీసుకోవచ్చు.. స్థిర పడకముందు ప్రేమ పెళ్లిలు చేసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని విద్యార్థులు అంటున్నారు. వారి మాటల్లోనే..



టాక్‌షోలో విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

ప్రేమించడం తప్పు కాదు



ప్రేమించడం తప్పు కాదు. ప్రేమిస్తే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. ఒప్పించకపోతే మున్ముందు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. జీవితంలో స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకుంటే ఆనందంగా ఉండొచ్చు.
–వంశీ, బీటెక్ విద్యార్థి

పెళ్లికి ముందు బాగానే ఉంటుంది



అవును వంశీ.. పెళ్లికి ముందు ప్రేమలు బాగానే ఉంటాయి. పెళ్లి తర్వాత బాగా తగ్గిపోతున్నాయి. నాకు తెలిసిన వారు ఇద్దరు ముగ్గురు లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. తర్వాత ఒకరినొకరు సరిగా అర్థం చేసుకోక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ఇంట్లో వారు చూసిన వారిని పెళ్లి చేసుకుంటే కుటుంబ పద్ధతులు అన్ని తెలుసుకుంటారు.
–విజయ్, విద్యార్థి

లవ్ మ్యారేజ్ వద్దు..



లవ్ మ్యారేజ్ కంటే ఇంట్లో వారుచూసి చేసిన పెళ్లిల్లే జీవితాంతం నిలబడే అవకాశాలు ఎక్కువ. ఒక వేళ లవ్ చేయాలనుకున్న వారు ఇంట్లో వారిని ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. లేకపోతే మొదట లవ్ చేసి ఇంట్లో వాళ్లు వద్దంటున్నారని చెప్పడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నేనైతే లవ్ మ్యారేజ్ వద్దనే ఫ్రెండ్స్‌కు సలహా ఇస్తాను.
–ప్రణీత, విద్యార్థిని

నువ్వు చెప్పింది కరెక్ట్ ప్రణీత



అవును ప్రణీత చెప్పింది కరెక్ట్.. లవ్‌లు ఎందుకు.. తల్లిదండ్రులకు మనం గౌరవం ఇవ్వాలి. వారు కుదుర్చిన పెళ్లిల్లే చేసుకోవాలి. లవ్ చేయడం వలన సమయం వృథా. చదువుపై శ్రద్ధ పెట్టలేం. దీంతో అనుకున్న గోల్‌ను రీచ్ కాలేకపోతాం. అందరం స్టడీస్‌పై దృష్టి పెట్టి లక్ష్యాలను చేరుకోవాలి. తల్లిదండ్రులు, మనకు చదువు చెప్పిన టీచర్ల గౌరవం పెంచాలి.
–నేహా, విద్యార్థిని

నిజమైన లవ్ మాత్రమే..



కొందరు ఆకర్షణతో లవ్ చేస్తుంటారు. నిజమైన లవ్ అయితేనే చేయాలి. ప్రేమించాలంటే ధైర్యం ఉండాలి. లవ్ వద్దు. నేహా చెప్పినట్లు మనం మొదట స్టడీస్‌పై ఇంట్రస్ట్ పెట్టాలి. పట్టుదలతో చదివి గోల్‌ను రీచ్ కావాలి. పెళ్లికి ముందు ఉన్న ప్రేమలు పెళ్లి తర్వాత ఉండటం లేదు. లవ్ మ్యారేజ్ చేసుకున్న వారిని చూస్తే అర్థం అవుతుంది.
–సాకేత్, విద్యార్థి

ఫస్ట్ లైఫ్‌లో సెట్ కావాలి



ఫస్ట్ కష్టపడి జీవితంలో స్థిరపడాలి. తర్వాత మనం లవ్ చేసినా ఇంట్లో వాళ్లు ఒప్పుకుంటారు. అప్పుడు మనకు అడ్డు చెప్పరు. ఫ్రెండ్స్ అందుకే మనం మొదట చదువుపై శ్రద్ధ పెట్టాలి. లవ్ చేస్తే ఇంట్లో వారిని ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. ఫ్రెండ్స్.. అందరికీ ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు. రేపు కలుద్దాం అందరం ఇంటివెళ్దాం సమయం ఫోర్ అవుతుంది.
–అలైఖ్య, విద్యార్థిని

ప్రేమ పెళ్లిళ్లు @ భూంపల్లి

మిరుదొడ్డి(దుబ్బాక): కుల మతాలను, ప్రేమకు అడ్డు చెప్పే పెద్దలను ఒప్పించి పిరికి తనంతో పారి పోకుండా ఉన్న ఊరిలోనే ప్రేమించి పెళ్లి చేసుకుని ధైర్యంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు భూంపల్లి ప్రేమ జంటలు. ధైర్యంగా ఉన్న ఊరిలోనే ప్రేమించి పెళ్లి చేసుకుని దాంపత్య జీవితం గడుపుతున్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రం ఇప్పుడు కులాంతర ప్రేమ వివాహాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఒక్కటి కాదు, రెండు కాదు ఇప్పుడు ఆ గ్రామంలో సుమారు 40 ప్రేమ జంటలు కులాంతర వివాహాలు చేసుకుని హాయిగా జీవిస్తున్నాయి. మొదట్లో పెద్దలు ప్రేమ వివాహాలకు అడ్డు చెప్పడం, కాల క్రమంలో ఉన్న ఊరిలోనే కళ్ల ముందే ప్రేమ జంటలు దాంపత్య జీవితాన్ని గడుపుతుండటంతో పెద్దలు కూడా కలివిడిగా కలిసి పోతున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రేమ జంటలు పిల్లా పాపలతో కాపురం చేస్తూ ప్రేమను బతికిస్తున్నారు. కులాంతర ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలు గ్రామంలో ప్రేమ దంపతుల సమ్మేళనం పేరుతో అవగాహన కలిగిస్తున్నారు.

ఆనందంగా జీవిస్తున్నాం



కులాలు వేరు కావడంతో మా ప్రేమ పెళ్లికి ఇరువర్గాల పెద్దలు అడ్డు చెప్పారు. పిరికితనంతో పారి పోకుండా పెద్దలను ఒప్పించి 2007లో కులాంతర వివాహం చేసుకున్నాను. గ్రామంలోనే ఉంటూ పెద్దల ముందు తలెత్తుకుని జీవించాలన్న ఉద్దేశంతో అక్బర్‌పేటలో ఓ చిన్న షాపు పెట్టుకుని ఉపాధి పొందుతున్నాను. ఇప్పుడు మాకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. వారిని మంచిగా చదివిస్తూ జీవితాన్ని గడుపుతున్నాం. ఇదే స్ఫూర్తితో భూంపల్లిలో చాలా మంది యువతీ యువకులు కులాంతర వివాహాలు చేసుకుని దాంపత్య జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు.
–మాధవాచారి, స్రవంతి కుటుంబం



భూంపల్లిలో నిర్వహించిన సమ్మేళనంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులు(ఫైల్)

యువత లక్ష్యాలను చేరుకోవాలి



సిద్దిపేటకమాన్: యువత ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకుని జీవితంలో ముందుకు వెళ్లాలి. ప్రేమ పేరుతో తెలిసీతెలియని వయసులో ఆకర్షణకు లోనై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఏది మంచి, ఏది చెడు తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులకు , చదువు నేర్పించిన గురువులకు మంచి పేరు తీసుకురావాలి.
–మహేందర్, సిద్దిపేటఅడిషనల్ డీసీపీ

ఆరోగ్య సంరక్షణకే రుతుప్రేమ



చిన్నకోడూరులో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టిన రుతుప్రేమ కార్యక్రమంపై ప్రతీ మహిళకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం చిన్నకోడూరులో మహిళలకు ఈ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటరీ ప్యాడ్స్‌కు బదులుగా పర్యావరణహితమైన శానిటరీ కప్పులను ఉపయోగించాలన్నారు. రుతుచక్రం మానవ సృష్టికి మూలమని, రుతచక్రం లేకపోతే మానవ జీవన విధానమే లేదన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్య సమాజం కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రోజు ఒక గ్రామంలో చైతన్య రథం తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరోజన, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండం వనిత, సర్పంచ్ ఉమేష్ చంద్ర, సర్పంచ్‌లు విజయలక్ష్మి, కవిత, ఎంపీటీసీ శారద, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, మహిళా సమాఖ్య సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ నిర్వహణలో అలసత్వం వద్దు

డీఐఈఓ సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నిర్వహణలో పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ), పరీక్షల కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షల చీఫ్‌సూపరిండెంట్(సీఎస్)లకు 15 నుంచి జరగనున్న ప్రాక్టికల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహణ విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే పరీక్షల కమిటీని సంప్రదించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరమే నూతనంగా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్న కేంద్రాల సీఎస్‌లు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరీక్షలను ప్రశాంతంగా, పొరపాట్లు లేకుండా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పరీక్షల కమిటీ సభ్యులు మంగరాజు, విజయేందర్‌రెడ్డి, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కిషన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌లు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. మూడేళ్లుగా ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించి రావాల్సిన పెండింగ్ కాంటిన్‌జెంట్ బిల్లులను ఇప్పించాలని డీఐఈఓకు ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్స్

16న సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ప్రారంభం



మాట్లాడుతున్న నిర్వాహకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతీయేటా నిర్వహించే సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ఈ సారి సినిమా హంగామాతో అట్టహాసంగా ప్రారంభం అవుతున్నట్లు నిర్వాహకులు మచ్చవేణుగోపాల్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్ తెలిపారు. 17న ప్రారంభ వేడుకలను 16 సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావుతో పాటు ప్రముఖ సినీ నటుడు నాని, క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నట్లు చెప్పారు. 19లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లను కలిగిన క్రిక్ హీరోస్ యాప్ టోర్నీ ఆఫద ఇయర్‌గా నిలిచిన సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫికి సంబంధించిన అవార్డును ఈ ప్రారంభ వేడుకల్లో మంత్రి అందుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మంత్రి పీఏ రాము, ప్రశాంత్‌గౌడ్, రాజు, విజయ్, టీఆర్‌ఎస్‌వీ నాయకులు రమేశ్, భిక్షపతి, భాస్కర్, నరేష్, అరవింద్ రెడ్డి, అకుబత్తిని రాము, సతీష్, కిరణ్‌గౌడ్, కమల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు భరత్



మద్దూరు (హుస్నాబాద్): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన తోళ్ల భరత్ ఎంపికయ్యాడు. ఆయన ఇటీవల హన్మకొండలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. హరియానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆయన హాజరుకానున్నాడు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నంగునూరు(సిద్దిపేట): బాలికలు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం అభినందనీయమని ట్రైనీ కలెక్టర్, ఎంపీడీఓ ఫైజాఅహ్మద్ అన్నారు. సోమవారం నంగునూరు, రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో గణితం బోధించి ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. రాజగోపాల్‌పేటలో కరాటే క్లాసులు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి సెల్ఫ్ డిఫెన్స్ గురించి అడిగి విద్యార్థినుల ప్రదర్శన చూసి అభినందించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ దేశిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్, సర్పంచ్ రాజేంద్ర, చందు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజావాణికి 81 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు ముజామ్మిల్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి


సిద్దిపేటరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి భూ సంబంధిత, డబుల్ ఇళ్లు, పెన్షన్లు తదితర విభాగాల నుంచి మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ అర్జీని పరిశీలించి త్వరగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజావాణిపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని, అర్జీల సంఖ్య పెరుగుతుండడం దీనికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు బిల్లు ఇప్పించండి



నా పేరు రాజయ్య. అందె గ్రామం. నేను రెండేళ్ల క్రితం నాలుగు నెలలు గ్రౌండ్ వాటర్ విభాగంలో కారు నడిపాను. అప్పటి నుంచి నేటి వరకు నాకు ఎలాంటి బిల్లులు ఇవ్వలేదు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు అందించాలి.

పెట్టుబడి సాయం వస్తలేదు



నా పేరు పూస మల్లయ్య. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామం. నాకు గతేడాది నుంచి రైతుబంధు సాయం రావడం లేదు. పాస్‌బుక్, అన్ని ఆధారాలు ఉన్నా నాకు పెట్టుబడి సాయం అందడం లేదు. అధికారులను అడిగితే వస్తుందని చెబుతున్నారు. ఈసారైన నాకు రైతుబంధు సొమ్ము వచ్చేలా చూడాలి.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించారు. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి జరిమానా విధించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి..



కంగ్టి(నారాయణఖేడ్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి..అందులోని రాగి తీగను దొంగలించిన సంఘటన మండల పరిధిలోని దామరగిద్ద శివారులో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రైతు సందా సుభాష్ పొలంలో 25 హెచ్‌పీ త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి, అందులోని రాగి తీగలు ఎత్తుకెళ్లారు. రైతులు సుభాష్, శేషారావు, హన్మంతులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా, లైన్‌మెన్ మల్‌రెడ్డి వచ్చి పరిశీలించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

పల్లె ప్రకృతివనంలో అగ్నిప్రమాదం



మంటలకు ఆహుతైన మొక్కలు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల పరిధిలోని వల్లూరు బృహత్ పల్లె ప్రకృతివనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో 1250 మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు మొక్కలను దహనం చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ చేస్తున్నామని నార్సింగి ఎంపీడీఓ ఆనందమేరి తెలిపారు. ప్రకృతివనంలో 32535 మొక్కలు నాటగా, ఇందులో 1250 వరకు కాలిపోయాయని ఆమె వెల్లడించారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చేటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం...ఆదివారం సాయంత్రం జగిత్యాల జిల్లాకు చెందిన కుడుకల శంకర్ కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చి గంగిరేణు చెట్టు వద్ద ప్రదక్షణ, చేస్తుండగా మేడ్చల్ జిల్లాకు చెందిన ఆకుల రమేష్, కరీంనగర్ చెందిన బల్లె రాజేశ్వరిలు శంకర్ ప్యాంట్ జేబులోనుంచి రూ.4000 దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఆకుల రమేష్, బల్లె రాజేశ్వరిలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4000 స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

గడ్డివాములు దగ్ధం

వెల్దుర్తి (తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరిల గ్రామంలో దగ్గుల బిక్షపతికి చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. స్థానికులు, ఫైరింజన్ సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని, పశువులకు గ్రాసం లేకుండాపోయిందని బాధితులు వాపోయాడు.

వెటర్నరీ కాలేజీకి చకచకా ఏర్పాట్లు

- ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించిన వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ఇండియా ప్రతినిధులు
- అన్నీ అనుకూలిస్తే..వచ్చే విద్యాసంవత్సరంలోనే ప్రవేశాలు



పశువైద్య కళాశాలకు కేటాయించిన స్థలం ఇదే..

సాక్షి, సిద్దిపేట: పీవీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి అనుబంధంగా సిద్దిపేట జిల్లాలో పశువైద్య కళాశాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. వచ్చే విద్యా సంవత్సరం (2023–2024) నుంచే దీనిని ప్రారంభించనున్నారు. సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ పశువైద్య కళాశాల మంజూరు చేస్తామని ప్రకటించారు. దీంతో కొండపాక మండల పరిధిలోని దుద్దెడ–మర్పడగ గ్రామాల పరిధిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు.

- వెటర్నరీ యూనివర్సిటీ నుంచి అధికారుల బృందం 2021 ఆగస్టు 31న కొండపాక మండలంలో దుద్దెడలోని ప్రభుత్వ భూమిని పరిశీలించింది. 30 ఎకరాలు కళాశాల ఏర్పాటుకు సరిపోతుందని, డెయిరీ, మేకలు, గొర్రెల ఫామ్‌కు మరో ఇరవై ఎకరాలు అవసరమన్నారు. అయితే అదే మండల పరిధిలోని లకుడారం సమీపంలో 20 ఎకరాలు కేటాయించే అవకాశముంది.
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో కొండపాక సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల భవనాన్ని అద్దెకు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నారు. అందులో తాత్కాలికంగా పశువైద్య కళాశాల ఏర్పాటు చేస్తారు.
- పశువైద్య కళాశాలకు అనుబంధంగా పొన్నాల సమీపంలోని పశువుల హాస్టల్‌ను డెయిరీఫామ్‌గానూ, సిద్దిపేటలోని పశువైద్యశాలను, వెటర్నరీ విద్యార్థుల అవసరాలకు వినియోగించే యోచనలోనూ ఉన్నారు.
- ఈ ఏడాది జనవరి 16, 17 తేదీల్లో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సిద్దిపేట జిల్లాలో పర్యటించారు. ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించారు. కౌన్సిల్ నుంచి అనుమతి రాగానే పశువైద్యకళాశాలను ప్రారంభిస్తారు.
- మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట జిల్లా విద్యాక్షేత్రంగా మారింది. రాజీవ్ రహదారిపై అటవీ కళాశాల, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉంది. తాజాగా పశువైద్య కళాశాల ఏర్పాటు కాబోతుంది.
- పశువైద్య కళాశాల ఏర్పాటయితే ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పాడిరైతులకు ఎంతో ప్రయోజనం. జీవాల పెంపకానికి ఆయా జిల్లాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆవులు, పాడి గేదెల సంఖ్యా ఎక్కువగానే ఉంది.

వెటర్నరీ కౌన్సిల్ నుంచి అనుమతి రాగానే

వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ఇండియా ప్రతినిధుల బృందం ఇటీవల సిద్ధిపేట జిల్లాలో పర్యటించింది. కౌన్సిల్ నుంచి అనుమతి రాగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి పశువైద్య కళాశాల ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ రఘునందన్, వెటర్నరీ యూనివర్సిటీ డీన్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర

ఏర్పాట్లపై సమీక్షించిన మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏడుపాయల జాతర ఏర్పాట్ల ప్రగతిపై సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్‌లతో కలిసి సమీక్షించారు. జిల్లా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఉండడమే జాతర విజయవంతానికి చిహ్నమన్నారు. అధికారులు సమష్టిగా, సమన్వయంతో ఈ నాలుగు రోజులు మరింత కష్టపడి పనిచేసి 16వ తేదీనాటికి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. జాతరకు భారీగా నిధులు వచ్చినందున శౌచాలయాలు, దుస్తులు మార్చుకునే గదులు, తదితర శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, వైఫై జోన్‌లు పెంచాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, వైద్య ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ 16 నాటికి ఏర్పాట్లు పూర్తయితే, 17న పోలీస్ సిబ్బందికి బ్రీఫింగ్ ఇస్తామన్నారు. గత జాతరలో తలెత్తిన పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ సైదులు, జెడ్పీ సీఈఓ శైలేష్, నీటిపారుదల ఎస్ఈ యేసయ్య, ఆర్డీఓ. సాయిరాం, ఏడీ జయరాజ్, డీపీఓ సాయిబాబ, ఆలయ ఈఓ సార శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గితెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



పోసానిపేటలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

జోగిపేట (అందోల్): 'వరి సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలి.. రానున్న రోజుల్లో పంటకు అగ్గి తెగులు (మెడవిరుపు) వచ్చే అవకాశముందని' ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సరిత, ఏఓ బి.వి జయరత్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోసానిపేటలో వరిపొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా వరినాట్లు వేసిన చోట అగ్గితెగులు సోకినట్టు గుర్తించామన్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఏ ఇబ్బందులు ఉండవని, అగ్గి తెగులు లక్షణాలు కనిపిస్తే యూరియా చల్లడం తాత్కాలికంగా నిలిపి వేయాలన్నారు. తొలిదశలో సిఫారసు చేసిన మందులను పిచికారీ చేయాలన్నారు. పలుచోట్ల వరి పొలంలో నాచు కట్టడం వల్ల ఎదుగుదల లేకపోవడాన్ని గుర్తించామని, ఈ సమస్యను అధిగమించేందుకు వరి పొలాన్ని చేతులతో కలియబెట్టి ఆరబెట్టాలన్నారు. పొలంలో చౌడు, జింక్‌లోపం వంటి సమస్యలను నివారించడానికి సేంద్రియ గుళికలు (హ్యూమిక్ యాసిడ్) వాడాలన్నారు. రైతులకు పంటల సాగుపై సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

కడుపునొప్పి భరించలేక..

కొండపాక(గజ్వేల్): కడుపు నొప్పిని భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ చెప్పిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మర్పడ్గ గ్రామానికి చెందిన ఆకారం మల్లేశం(35) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో దూలానికి ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు 108లో సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని గాయాలు



గాయపడిన అనిల్

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తుతెలియని బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కూచారం వద్ద చోటుచేసుకుంది. ప్రమాదంలో తూప్రాన్ నుంచి బాలానగర్ వైపు వెళుతున్న అనిల్ కాలు విరిగింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తి తన బైక్‌తో అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో వివరాలేమీ తెలియలేదు. గాయపడిన అనిల్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పెచ్చులూడిన తరగతి గది స్లాబ్

మధ్యాహ్న భోజనానికి వెళ్లడంతో విద్యార్థులకు తప్పిన ప్రమాదం



తరగతి గదిలో పెచ్చులూడి పడిన దృశ్యం

నర్సాపూర్ రూరల్: మండలపరిధిలోని తుజాల్‌పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం పాఠశాలలోని పైఅంతస్తులోని ఐదవ తరగతిగదిలో మధ్యాహ్న సమయంలో స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. ఈ సమయంలో విద్యార్థులు భోజనం కోసం తరగతి గది నుంచి బయటకు వెళ్లడంతో తృటిలో ప్రమాదం తప్పిందని పాఠశాల హెచ్ఎం శివకుమార్ తెలిపారు. మరో రెండు గదుల్లో కూడా పెచ్చులూడే పరిస్థితి ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

అనుమతి లేకుండా చెట్లు నరికివేత



పాఠశాలలో చెట్లను నరికిన దృశ్యం

వట్‌పల్లి(అందోల్): విద్యాలయాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే మరోవైపు చెట్లను నరికివేస్తూ ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. బిజిలీపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏళ్ల తరబడిగా పెరిగిన చెట్లు నేలకొరిగాయి. విద్యాశాఖ అనుమతి లేకుండానే చెట్లను నరికివేశారు. చెట్ల నరికివేత అత్యవసరమైనప్పటికీ విద్యాశాఖ అధికారులకు తెలిపి టెండర్ ప్రక్రియ ద్వారా తొలిగించాల్సి ఉంది. కానీ ఈ పాఠశాలలో అలాంటి నిబంధనలు ఎవరూ పాటించలేదు. పాఠశాలలో ఉన్న కొన్ని చెట్లపై పురుగు వ్యాపించిందని ఆ పురుగులతో విద్యార్థులకు దురదలు వచ్చాయని దీంతో రిపబ్లిక్‌డే రోజున గ్రామస్తులు తీర్మానం చేసి చెట్లు నరికినట్లు పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు తెలిపాడు. ఈ విషయమై మండల ఇన్‌చార్జి ఎంఈఓ బి.క్రిష్ణను వివరణ కోరగా తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



కనకచంద్రం (ఫైల్)

దుబ్బాకరూరల్: అంత్యక్రియలకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలోని చిట్టాపూర్‌లో జరిగింది. ఏఎస్‌ఐ బిక్యానాయక్ తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన జిగిరి కనకచంద్రం (42) పెద్దమ్మ జిగిరి భూమవ్వ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. బంధువులు, కుటుంబసభ్యులు స్నానాలు చేయడానికి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి కనకచంద్రం చెరువులో పడి మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...



రణవీర్ (ఫైల్)

నర్సాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే...నర్సాపూర్‌కు చెందిన మంగళి రణవీర్(50) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో వెల్దుర్తి మార్గంలో నడుచుకుంటూ వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడగా, స్థానికంగా చికిత్స చేసి, సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిళ్లు దగ్ధం



యావపూర్‌లో దగ్ధమవుతున్న వస్తువులు

తూప్రాన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని యావపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోరీబీకి చెందిన పెంకుటిళ్లు నుంచి మంటలు రావడం గమనించిన కుటుంబసభ్యులు లబోదిబోమంటూ బయటకు పరుగులు తీశారు. గమనించిన ఇరుగుపొరుగు వారు గజ్వేల్‌లోని ఫైర్‌ఇంజన్‌కు ఫోన్ చేశారు. మంటలను ఆర్పేందుకు శ్రమించినా, అప్పటికే ఇంట్లోని వస్తువులు బియ్యం, బంగారం, నగదు కాలిపోయాయి. ఇళ్లు కూడా కాలి బూడిద అయ్యింది. అన్నీ కలుపుకొని రూ.20లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని కుటుంబసభ్యులు వాపోయారు. మొదటల్లో గ్యాస్ సిలిండర్‌తో ప్రమాదం సంభవించిందని అనుమానించారు.

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం అదనపు కలెక్టర్లు ముజామ్మిల్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ×సరైన ఆర్థిక వ్యవహారమే మిమ్మల్ని కాపాడుతుంది ×అనే అంశంపై ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిల్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలను నిమిషాల వ్యవధిలో పొందవచ్చన్నారు. వృథా ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేసుకోవాలని సూచించారు, సైబర్ నేరగాళ్ల నుంచి దూరంగా ఉండేందుకు బ్యాంకు ఓటీపీలు, ఇతర లింకులుగాని, ఫ్రీగా వచ్చే డబ్బులకు ఆశ పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా, ఐసీఐసీఐ, బ్యాంకు మేనేజర్లు, కస్టమర్లు, జిల్లా అధికారులు, ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ దయాకర్, సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్స్ శ్రీనివాస్, సాయి , తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో దొంగల బీభత్సం



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేటలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన కందుల వెంకట్‌రెడ్డి మూడు రోజుల కిందట తిరుపతికి వెళ్లాడు. చాడ లక్ష్మారెడ్డి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం వీరి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో దొంగలు పడ్డారన్న విషయాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారువచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న బాధితుడు చాడ లక్ష్మారెడ్డి హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చాడు. పలు వస్తువులు కనిపించపోయేసరికి హైరానా పడ్డారు. ఇంట్లో నగదు రూ.40వేలు, 9తులాల బంగారు ఆభరణాలు, 6తులాల వెండి చోరీకి గురైందని గమనించాడు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ ఘటనాస్థలిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. కందుల వెంకట్‌రెడ్డి వస్తే తప్ప వారి ఇంట్లో ఏం పోయాయో తెలుస్తాయన్నారు.

మా గోస ఏవరికీ పట్టదా!

- ఆడబిడ్డలకు పరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా



ఆందోళనకారులను ఊర్లకు వెళ్లాలని చెబుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసితుల గోసలు తీర్చాలని, పెళ్లిళ్లు అయిన ఆడబిడ్డలకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మా గోస ఎవరికీ పట్టదా అంటూ ఆఫీసు ఎదుట బైఠాయించారు. ప్రాజెక్టు భూములను సర్వే చేసినప్పుడు 18 ఏళ్లు ఉన్న ఆడబిడ్డలకు అందరికీ పరిహారం ఇస్తారని ఆశించారు. పలుమార్లు బాధితులందరికీ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హామీ ఇవ్వడంతో బాధితులు మూడునెలల నుంచి ఓపికతో పనులకు అడ్డు చెప్పకుండా ఉన్నారు. ఈ రోజు అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే 90 మందికి పరిహారం ఇవ్వడం సాధ్యపడదని చెప్పడంతో ధర్నాకు దిగారు. ఏసీపీ సతీశ్ అక్కడకు చేరుకొని ఆందోళన కారులను సముదాయించే ప్రయత్నం చేసిన వినలేదు. ఎమ్మెల్యేనే నేరుగా బాధితులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసారన్నారు. ఏసీపీ బాధితులతో మాట్లాడి అక్కడి నుంచి ఊర్లకు పంపించారు.

అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి..

భర్తపై దాడి చేసి.. భార్య పుస్తెలతాడు అపహరించి

హత్నూర(సంగారెడ్డి): ఇంట్లోకి చొరబడి భర్తపై దాడి చేశారు..భార్య మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించారు. ఈ సంఘటన మండల పరిధిలోని చందాపూర్ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో జరిగింది. బాధితులు, పోలీసుల చెప్పిన వివరాల ప్రకారం... మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మొగులయ్య–లలిత దంపతులు ఫామ్‌హౌస్ ఏడాదిన్నరకాలంగా పశువుల కాపరులుగా పనిచేస్తున్నారు. అక్కడే నిర్మించిన గదుల్లో నివాసముంటున్నారు. రోజు మాదిరిగానే ఆదివారం కూడా భోజనం చేశాక నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటాక ముగ్గురు బలవంతంగా తలుపులు తట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇద్దరు మొగులయ్యపై దాడి చేసి అరవకుండా గొంతు గట్టిగా పట్టుకున్నారు. మరో వ్యక్తి లలిత మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు లాక్కుని వెళ్లారు. మొగులయ్య తన సెల్ నుంచి చందాపూర్‌లో ఉన్న బంధువులకు కాల్ చేశాడు. బంధువులు, గ్రామస్తులు ఫామ్‌హౌస్‌కు చేరుకొని పరిసరాల్లో గాలించగా, జార్ఖండ్‌కు చెందిన ఓ వ్యక్తి తారసపడ్డాడు. అతడిని పోలీసులకు అప్పగించారు. హత్నూర ఎస్‌ఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు.. టిప్పర్ ఢీ

ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

పటాన్‌చెరుటౌన్: కారు.. టిప్పర్ ఢీకొట్టుకున్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు కథనం ప్రకారం వివరాలు...గోల్కొండకు చెందిన జైనగౌరి తన స్నేహితుడు అనిల్‌కుమార్‌తో కలిసి 12వ తేదీన జరిగే బంధువుల ఫంక్షన్‌కు బయలుదేరాడు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో ఉండే బేహగ్, ఠాగుర్ చరణ్ సింగ్‌లను తీసుకొని సదాశివపేటకు వెళ్లారు. ఫంక్షన్ నుంచి తిరుగు ప్రయాణంలో అనిల్ కుమార్(36) కారు నడుపుతున్నాడు. చరణ్‌ను ఇంద్రేశంలో దింపేందుకు పోచారం సర్వీస్ రోడ్డు మీదుగా సోమవారం తెల్లవారుజామున వెళుతుండగా, నిలిపిఉంచిన టిప్పర్‌ను గమనించకుండా ఢీకొట్టాడు. ఈ ఘటనలో అనిల్ కుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనకాల కూర్చున్న చరణ్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా టిప్పర్ పార్కింగ్ చేసిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి స్నేహితుడు జైన్‌గౌరి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ ప్రధాని కావాలని సర్పంచ్ పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మీనారాయణ

మెదక్ రూరల్: సీఎం కేసీఆర్ దేశ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఓ సర్పంచ్ సోమవారం పాదయాత్ర ప్రారంభించాడు. మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం బోగుడ భూపతిపూర్ గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ కుమ్రం భీం జిల్లా నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తున్నాడు. సీఎం కేసీఆర్ జన్మదినమైన 17వ తేదీ నాటికి పాదయాత్ర హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

తల్లి బంగారం తీసుకుని కుమారుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లి బంగారం తీసుకుని ఇంట్లో నుంచి ఓ కుమారుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన లక్ష్మీ కుమారుడు శ్రీకాంత్ ఓ కంపెనీలో పనిచేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఉన్న తల్లి బంగారు నెక్లెస్, బంగారు కమ్మలు, ఉంగరం తీసుకొని వెళ్లాడు. తల్లి కుమారుడు శ్రీకాంత్‌కి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో కుమారుడు కోసం తల్లి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లి మూడు నెలల తర్వాత తిరిగి తన కుమారుడు వచ్చినట్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సుడా' మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: సుడా పరిధిలోని గ్రామాల భూములను అమృత్ సిటీ ఫేజ్– 2లో భాగంగా వివిధ జోన్‌లుగా విభజించి తయారు చేసిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.